క్లుప్తంగా

వేగంగా ఇంకుడు గుంతల నిర్మాణం



ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శివకుమార్

సైదాపురం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సైదాపురం మండలానికి 179 ఇంకుడు గుంతలను మంజూరు చేశారని, వాటి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ కోరారు. మండలంలోని లింగసముద్రం, తిప్పిరెడ్డిపల్లి పంచాయతీల పరిధిలో ఇంకుడు గుంతల నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో సిబ్బందికి అవగాహన కల్పించారు.

నేటి నుంచి కుంభాభిషేక వేడుకలు

నాయుడుపేట టౌన్: తుమ్మూరు గ్రామంలో టీటీడీకి అనుబంధంగా ఉన్న శ్రీగంగాకామాక్షి సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేక వేడుకలను శనివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్ శుక్రవారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. టీటీడీ కార్యానిర్వహణాధికారి పర్యవేక్షణలో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టిన పూర్తి చేసినట్లు తెలిపారు. 15, 16వ తేదీలలో ఆలయం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17వ తేదీ శాంతి కల్యాణోత్సవం,, ధ్వజావరోహణం, నివేదన తదితర ప్రత్యేక పూజలతో కుంభాభిషేక వేడుకలు ముగుస్తాయన్నారు.

పుల్వామా అమరవీరులకు ఘన నివాళి



పుల్వామా అమరవీరులకు నివాళి

గూడూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పుల్వామా ఘటనలో అమరులైన సైనికులకు ఘన నివాళులర్పించారు. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్‌కుమార్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను ఇచ్చిన సైనికులను గుర్తు చేసుకోవాలని కోరారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం దామోదర్, బీజేవైఎం నగర అధ్యక్షుడు శివశంకర్, ఉపాధ్యక్షుడు కార్తీక్, ప్రణయ్, నవీన్, కిరణ్, ప్రదీప్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

విలీనంపై పాఠశాల ముందు ధర్నా

కలువాయి: కలువాయి వెస్ట్ పాఠశాలను మోడల్ పాఠశాలలో విలీనం చేయాలని అధికారులు తీసుకున్న నిర్ణయానికి నిరసనగా ఎస్‌ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వారు నినాదాలు చేశారు. అధికారులు తమ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు.

స్వశక్తితో జీవనం సాగించవచ్చు



మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

చిల్లకూరు: చేతి వృత్తులు నేర్చుకున్న వారు తమ స్వశక్తితో జీవనం చేస్తూ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచే వీలుంటుందని జిందాల్ సింహపురి యూనిట్ హెడ్ శ్రీనివాసరావు తెలిపారు. పరిశ్రమ సీఎస్‌ఆర్ నిధులతో చుట్టు పక్కల గ్రామాలలోని 37 మంది మహిళలకు 75 రోజులపాటు నిర్వహించిన కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ముగించారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్‌లు అందించారు. అతిథిగా విచ్చేసిన చింతవరం కెనరా బ్యాంకు మేనేజర్ మోహన్ మాట్లాడుతూ మహిళలకు బ్యాంకు ద్వారా రుణాలు అందించి ప్రోత్సహిస్తామన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కో–ఆర్డినేటర్ మురళీ, పరిశ్రమ ప్రతినిధి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించని దుకాణాల మూత

నాయుడుపేట టౌన్: నెలల తరబడి అద్దెలు చెల్లించని మున్సిపల్ దుకాణదారులపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా పేర్కొన్నారు. పట్టణంలోని నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి దుకాణాల సముదాయం వద్ద శుక్రవారం కమిషనర్ బిల్ కలెక్టర్‌లతో కలిసి బకాయిలు ఉన్న దుకాణాలను పరిశీలించారు. 9 నెలల పైబడి బకాయిలు ఉన్న దుకాణాలకు సీళ్లు వేశారు.

అమర జవాన్లకు ఘన నివాళి

కోట: పాకిస్తాన్ ఆత్మాహుతి దాడిలో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్‌లకు శుక్రవారం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్‌లు ఘనంగా నివాళి అర్పించారు. పుల్వామా ప్రాంతంలో కవ్వింపు చర్యలకు పాల్పడిన పాకిస్తాన్ సైనికులు ఒక్కసారిగా ఆత్మాహుతి దాడి చేసి 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్‌లను పొట్టన పెట్టుకున్నారు. శుక్రవారం విద్యానగర్ కూడలిలో ఎన్‌సీసీ క్యాడెట్లు సీఆర్‌పీఎఫ్ జవాన్‌లకు ఘనంగా నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ డాక్టర్ జి.మాధవయ్య, మల్లికార్జునరెడ్డి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

నీటి కోసం.. కోటి కష్టాలు

- కొర్లగుంట ఎస్టీ కాలనీలో తాగునీటికి కటకట
- ఇంటింటికీ కొళాయిలు ఉన్నా అందని నీళ్లు
- మూలన పడిన వాటర్ ట్యాంక్





తొట్టె నుంచి నీళ్లు తోడుకుంటున్న గిరిజన మహిళ, కొర్లగుంటలో నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

దొరవారిసత్రం: నేలపట్టు పంచాయతీ పరిధిలోని కొర్లగుంట గిరిజన కాలనీలో 50 కుటుంబాల జీవనం సాగిస్తున్నాయి. ఇంటింటికి మంచి నీటి కొళాయిలు ఉన్నప్పటికీ పథకం నీళ్లు రావు. ఒకే నీటి సరఫరా అయినా కొన్ని దగ్గర్ల లోతుగా (నిర్మించుకున్న తొట్టెలు) ఉన్న కొళాయిలకు మాత్రమే పథకం నీళ్లు వస్తున్నాయి. దీంతో అతి కష్టం మీద వాటిని తోడుకునే దుస్థితి ఏర్పడింది. ఈ సమస్య గత కొన్నేళ్లుగా గిరిజనులను వెంటాడుతూనే ఉన్నా చర్యలు చేపట్టాల్సిన పంచాయతీ పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. కాలనీ వాసులు కూడా ఎవరికి ఏం చెప్పాలో తెలియక ఆయోమయస్థితిలో ఉన్నారు.

రెండు శాఖల పథకాలు

కొర్లగుంట ఎస్టీ కాలనీకి ఆర్‌డబ్ల్యూఎస్‌వారి బోరు పాయింట్, వీధుల్లో, ఇళ్లలో కొళాయిలు ఏర్పాటు చేశారు. అయితే సక్రమంగా నీళ్లు వచ్చిన దాఖలాలే లేవు. 2013–14లో నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి చెందిన వన్యప్రాణి విభాగం శాఖ వారు బయో శాప్ పథకం కింద ఈ కాలనీకి రూ.5 లక్షల వరకు వెచ్చించి వాటర్ ట్యాంక్, బోరు పాయింట్ వేశారు. దీని నిర్వహణను పంచాయతీ, ఫారెస్ట్ శాఖల వారు పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారింది. రోజూ అందాల్సిన పథకం నీళ్లు వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే అందుతున్నాయి. ఇవి కూడా సుద్ద నీరు కావడంతో కొళాయిల్లో వచ్చినప్పుడు వాడుకునేందుకు మాత్రమే పట్టుకుంటున్నారు. తాగేందుకు క్యాన్ నీళ్లను రూ.20కి కొనుగోలు చేయక తప్పడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.



నీళ్లు రాని వీధి కొళాయి

సుద్ద నీరే తాగుతున్నాం



కొర్లగుంట ఎస్టీ కాలనీకు నీటి పథకం ఉన్నా వచ్చేది సుద్ద నీరు. చేసేది ఏమీ లేక ఆ నీళ్లనే తాగుతున్నాం. క్యాన్ నీళ్లు కొనే స్థోమత లేదు. ఈ విషయం అధికారులు గుర్తించి తమ కాలనీకు మంచి నీళ్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలి.
– కోట్లపాటి చెంగమ్మ, కొర్లగుంట ఎస్టీ కాలనీ

రెండు రోజులకు ఒక్కసారే వస్తాయి



ఎస్టీ కాలనీకి రెండు రోజులకు ఒక్కసారి పథకం నీళ్లు వస్తాయి. వచ్చే అరొకొర నీళ్లు కూడా సక్రమంగా రావు. ఎక్కడ పడితే అక్కడ గుంటలు తీసేయడంతో అధికారులు వీధుల్లో ఏర్పాటు చేసిన కొళాయిల్లో నీళ్లు రాకుండాపోయాయి. – బండి మణి, కొర్లగుంట ఎస్టీ కాలనీ

చీపినాపిలో అధికారుల తనిఖీలు



పాఠశాలలో అధికారుల బృందం

కలువాయి: ఓడీఎఫ్ ప్లస్ గ్రామ పంచాయతీగా కలువాయి మండలం చీపినాపిని ఎంపిక చేసిన నేపథ్యంలో అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త నుండి సంపద కేంద్రాన్ని, కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్, గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను చేజర్ల మండల అధికారుల బృందం తనిఖీ చేసింది. పాఠశాల సమస్యలపై ఉపాధ్యాయులతో చర్చించారు. చేజర్ల ఎంపీడీఓ విజయలలిత, ఈఓపీఆర్డీ రామయ్య, కలువాయి ఈఓపీఆర్డీ రమేష్‌బాబు, సిబ్బంది సునీల్, పీఏస్ శివనాగేంద్ర, సర్పంచ్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతంగా ఉండేలా చూడాలి



శిక్షణ ఇస్తున్న సీడీపీఓ మహబూబీ

చిల్లకూరు: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భవతులు, బాలింతలు, మూడేళ్లలోపు పిల్లలు ఆరోగ్యవంతగా ఉండేలా చూసే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదేనని ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబీ సూచించారు. మండల కేంద్రమైన చిల్లకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించే పోషణ్ భి- పడాయిభి అనే శిక్షణా కార్యక్రమంలో శుక్రవారం ఆమె శిక్షణ ఇచ్చారు. చిన్న పిల్లలకు కేంద్రంలో ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని సూచించారు సూపర్‌వైజర్‌లు శివజ్యోతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నేడు సైదాపురానికి నేదురుమల్లి

సైదాపురం: మండలంలోని రామసాగరం, తుమ్మలతలుపూరు, అన్నంరాజుపల్లి గ్రామాల్లో పలువురు నేతలను వైఎస్‌ఆర్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శనివారం సాయంత్రం పరామర్శించనున్నట్లు మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్‌యాదవ్ శుక్రవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ముందంజలో చిల్లకూరు మండలం



చిల్లకూరు: స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించేందుకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చేపట్టిన ఇన్‌లైన్ క్లోరినేషన్ కార్యక్రమంలో చిల్లకూరు మండలం జిల్లాలోనే ముందంజలో ఉందని డీఎల్‌పీఓ వెంకటరమణ తెలిపారు. ఇన్‌లైన్ క్లోరినేషన్ పనితీరును శుక్రవారం ఆయన మండల అధికారులతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిల్లకూరు మండలంలోని అన్ని పంచాయతీలలో ఉన్న 84 వాటర్ ట్యాంకుల వద్ద ఈ కార్యక్రమం పూర్తి చేసి పంచాయతీ సిబ్బంది ముందంజలో ఉందని అన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ గోపి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, అల్లిబాషా తదితరులు ఉన్నారు.

క్లోరినేషన్ మిషన్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ, ఎంపీడీఓలు

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



మినరల్ వాటర ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సతుకుమాటి ప్రగతి, గ్రామ పెద్దలు

చిల్లకూరు: తన కుమారుడి జ్ఞాపకార్థం వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు గ్రామస్తులకు సౌకర్యంగా ఉండేలా రూ.4.5 లక్షల ఖర్చు చేసి నిర్మించి ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని ఏరూరుకు చెందిన వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు సతుకుమాటి సుధీర్‌రెడ్డి తనయుడు అఖిల్‌రెడ్డి గతేడాది అకాల మరణం పాలయ్యాడు. అఖిల్ రెడ్డి జ్ఞాపకార్థం వాటర్ ట్యాంకు దగ్గరలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. గ్రామంలోని వారు ఎవరైనా ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్లాంట్ వద్దకు వచ్చి నీటిని ఉచితంగా తీసుకుని వెళ్లవచ్చని తెలిపారు. అలాగే చిల్లకూరులోని డానియల్ చిల్డ్రన్ హోంలో వసతి పొందుతున్న 50 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. సతుకుమాటి ప్రగతి, గ్రామ పెద్దలు, వైఎస్‌ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ సీఎం దృష్టికి వెంకటగిరి సమస్యలు









వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ ఆరిశంకరయ్య, పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ సేతరాసి బాలయ్య , పేచీరాజ్



కౌన్సిలర్ కందాటి కళ్యాణి, రాజారెడ్డి



వహీదా యస్దానిబాషా

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి మున్సిపాలిటీలోని సమస్యలను 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. పట్టణంలో రూ.40 కోట్ల విలువైన భూ ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన కౌన్సిలర్లు పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, 9వ వార్డు కౌన్సిలర్లు కందాటి కళ్యాణి, రాజారెడ్డి దంపతులు 19వ వార్డు కౌన్సిలర్ వహీద, యస్దాని బాషా దంపతులు, 14వ వార్డు కౌన్సిలర్లు ఆరి శంకరయ్య సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శాలువ, పుష్పగుచ్ఛాలతో మర్యాదపూర్వకంగా కలిశారు. గంజాయి కేసు బాధితుడు తంగాపేచీరాజ్ కూడా ఆయన్ను కలిసిన వారిలో ఉన్నాడు.

రేపు హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

చిల్లకూరు: 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపికను ఈ నెల 16న చిల్లకూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల క్రీడా మైదానంలో చేపడుతున్నట్లు శుక్రవారం గురుకులం పీడీ, నెల్లూరు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి డి.శ్రీరేష్ తెలిపారు. గురుకుల పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జట్టును ఎంపిక చేసేందుకు చిల్లకూరులో క్రీడా మైదానాన్ని సిద్ధం చేశామన్నారు. ఇక్కడ ఎంపికైన జట్టు 21 నుంచి 23 వతేదీ వరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటుందన్నారు. క్రీడాకారులు 01.01.2015 తరువాత పుట్టిన వారు అర్హులన్నారు. ఎంపిక జరిగే సమయంలో ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలను తప్పని సరిగా తీసుకురావాలని అన్నారు. వివరాలకు 97048 27095 నెంబరులో సంప్రదించాలని కోరారు.

చెన్నూరులో భారీ అన్నదానం



మాజీ ఎమ్మెల్యే యల్లసిరి శ్రీనివాసులురెడ్డి చిత్రపటానికి నివాళి

గూడూరు రూరల్: చెన్నూరు గ్రామంలోని బస్టాండ్ వద్ద శుక్రవారం రాపూరు మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు మాజీ జెడ్పీ చైర్మన్ దివంగత యల్లసిరి శ్రీనివాసులురెడ్డి(వైఎస్‌ఆర్) 3వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆటో యూనియన్, ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పుష్పాంజలి ఘటించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వై.శ్రీనివాసులురెడ్డి, ఎస్.ఎస్.రెడ్డి, హరి, శివకుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు జి.శంకరయ్య, ఆటో యూనియన్ నాయకులు దారా బాబు, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విశ్వోదయ మైదానంలో పోలీసు కవాతు



సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరి రూరల్: పట్టణంలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణంలో సీఐ ఏవీ రమణ ఆధ్వర్యంలో వెంకటగిరి సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందితో పోలీసు పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది కవాతు నిర్వహించడంతో క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. ఆరోగ్యకరంగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి ఎస్‌ఐలు సుబ్బారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యనందించాలి



రాపూరులో శిక్షణ ఇస్తున్న రాధిక

రాపూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారంతో పాటు ఆటపాటలతో నాణ్యమైన విద్యను అందించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. రాపూరులోని హిందూ ప్రాథమిక పాఠశాల్లో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌భీ –పడాయిభీ అనే కార్యక్రమంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలను బలోపేతం చేయడంతోపాటు చిన్నారుల మానసిక శారీరక ఎదుగుదలతో అగన్‌వాడీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలన్నారు. గర్భవతులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు.

లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

పెళ్లకూరు: చెంబేడు–పునబాక ఆర్అండ్‌బీ రహదారి మార్గంలో పునబాక చెరువుతట్టు కండ్రిగ గ్రామం వద్ద శుక్రవారం గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి లారీలను అడ్డుకొని రహదారిని దిగ్బంధం చేశారు. గత కొంత కాలంగా 71వ నంబరు జాతీయ రహదారి రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల కోసం మెగా కంపెనీ యాజమాన్యం పునబాక చెరువుతట్టు కండ్రిగ మీదుగా స్టోన్ క్రషర్ నుండి లారీలు అధిక లోడుతో ముడి సరుకు తీసుకెళుతున్నాయి. దీంతో ఆర్అండ్‌బీ రోడ్డుపై భారీ గోతులు ఏర్పడి కంకర రాళ్లు తేలిపోయి పూర్తిగా ధ్వంసమైంది. జాతీయ రహదారి పనులు ఈ నెలాఖరుకు పూర్తి కావస్తుండడంతో రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. యాజమాన్యం సరైన సమాధానం ఇవ్వకపోవడంతో గ్రామస్తులంతా కంపెనీ లారీలను అడ్డగించి రహదారిపై ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న యాజమాన్యం సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి ఈ నెల 25న ఆర్అండ్‌బీ రోడ్డును అభివృద్ధి చేస్తామని చెప్పడంతో లారీలను వదిలారు.

టీడీపీ నేతలు చెప్పినోళ్లకే పనులు





మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మీ, సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఏఈ

- నీటి పారుదల శాఖ ఏఈ సంచలన వ్యాఖ్యలు

చిట్టమూరు: ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సర్వసభ్య సమావేశంలో నీటి పారుదల శాఖ ఏఈ అబ్దుల్‌ఘనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి పని అధికార పార్టీ నేతలు చెప్పిన వారికే కట్టబెడతామని బహిరంగంగా చెప్పడంతో మిగిలిన సభ్యులు అవాక్కయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలోఎంపీపీ సన్నారెడ్డి విజయలక్ష్మీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరై, వారి శాఖల పనితీరును వివరించారు. నీటి పారుదల శాఖ వంతు రాగానే ఏఈ మాట్లాడుతూ అధికార పార్టీని పొగడడంతోపాటు పనులను పార్టీ నేతలు చెప్పిన వారికే ఇస్తామని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు ఒక్క సారిగా ఆయన మాటలను ఖండించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయలక్ష్మీ, వైస్ ఎంపీపీ బద్దిగ వెంకటరమణయ్యతో పాటుగా, జెడ్పీటీసీ చిప్పల వెంకటయ్య మాట్లాడుతూ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించంచాలన్నారు. ఏఈ మాట్లాడిన దానికి ఎంపీడీఓ మనోహర్‌గౌడ్ అభ్యంతరం తెలియజేశారు. మండల స్థాయి అధికారులు పలు సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ రాయపు సుబ్బమ్మ, ఎంపీటీసీ ఫకీరయ్య, తహసీల్దార్ విజయలక్ష్మీ, వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, ఏపీఓ చిన్నయ్య, ఏపీఎం గునయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన గణేష్

నాయుడుపేటటౌన్: పట్టణంలోని భగవాన్ రమణ మహర్షి ఆశ్రమంలో పనిచేస్తున్న వెలూరు గణేష్(24) ఆశ్రమంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పూనుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ ఆదిలక్ష్మి కథనం.. తిరుపతి సమీపం లోతనపల్లి ప్రాంతానికి చెందిన గణేష్ 8 నెలలుగా నాయుడుపేట స్వర్ణముఖి నది సమీపంలో ఉన్న రమణ మహర్షి ఆశ్రమంలో పనిచేస్తున్నాడు. ఆశ్రమ నిర్వాహకులు మల్లికార్జునకు సంబంధించి ఆయుర్వేద మందులు తయారు చేసేందుకు గణేష్ సహకరిస్తున్నాడు. శుక్రవారం రాత్రి గణేష్‌కు భోజనం తీసుకుని మల్లికార్జున ఆశ్రమం వద్దకు వచ్చి చూసేసరికి తలుపులు వేసుకున్నాడు. అనుమానంతో చూడగా గణేష్ చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండడం గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గణేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సీఐ బాబి సారథ్యంలో విచారిస్తున్నట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి వెల్లడించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రుణాలు వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సైదాపురం: మండలంలోని కుల వృత్తులు చేసుకుంటున్న కుమ్మరి, శాలివాహన, మేదర కులాలకు ప్రభుత్వం స్వయం ఉపాధి రుణాలు బీసీ కార్పొరేషన్ ద్వారా అందించనున్నట్లు ఎంపీడీఓ పురుషోత్తంశివకుమార్ తెలిపారు. మండల కేంద్రమైన సైదాపురంలో శుక్రవారం రుణాల విషయమై కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలలోని కుమ్మరి, శాలివాహన కుండలు, వెదురుబుట్టలు తయారు చేసే మేదర కుటుంబాలు వారు మాత్రమే ఈ పథకాలకు అర్హులని తెలిపారు. కుమ్మరి, శాలివాహన, మేదరలకు మాత్రమే ఆ రాయితీ రుణాలను అందిస్తామన్నారు. ఇందులో వ్యక్తిగతం కాకుండా గ్రూపులుగా ఏర్పడాలని, ఒక్కొక్క గ్రూపులో 3 నుంచి ఐదుగురు సభ్యులుగా ఉండాలన్నారు. ఒక్కొక్క గ్రూపునకు యూనిట్ విలువ రూ.3 లక్షలు ఉంటుందన్నారు. ఇందులో 50శాతం రాయితీ ఇస్తుందన్నారు. అర్హత కలిగిన వారు కుల, ఆదాయం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులతో ఓబీఎంఎస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



వేద పండితులు ఏర్పాటు చేసిన హోమాలు



ప్రత్యేక పూజలు

సైదాపురం: మండల కేంద్రమైం సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీసిద్ధలయ్య కోన అవరణలో నూతనంగా నిర్మించిన సాయినాథ స్వామి దేవస్థానంలో సాయిబాబా నూతన విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం నుంచి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణ శర్మ పర్యవేక్షణలో 36 మంది వేదపండితుల ఆధ్వర్యంలో శుక్రవారం విశేషాభిషేకాలు, పూజలు, గణపతి, రుద్ర, చండీ, సుదర్శన, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం వైభవంగా స్వామివారి గ్రామోత్సవం చేపట్టారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

శనివారం నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆలయ నిర్మాణ దాతలు ఆదూరు గిరిబాబు అరుణ ఆధ్వర్యంలో స్వామివారి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈసందర్భంగా యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఉదయం 8.27కు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదూరు గిరిబాబు పేర్కొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పుష్పాంజలి

గూడూరు రూరల్: పట్టణంలోని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్రరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఫోరం జాతీయ అధ్యక్షుడు డేగ రవి రాఘవేంద్ర, బీఎస్పీ నాయకులు భాస్కర్ గౌడ్, ఫోరం నాయకులు అయ్యప్ప, దయాసాగర్, శ్రీనివాసులు, కేదార్‌నాథ్‌గౌడ్ పాల్గొన్నారు.